క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కళ్యాణం



నందిగామ: త్రిశక్తి పీఠంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో నిర్వహిస్తున్న తొమ్మిదో వార్షిక మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు వేకువజామునే పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాజశ్యామల సహిత రుద్రయాగం నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. అనంతరం వేదపండితులు రాజేష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, సాయిశర్మ, శేఖర్‌శర్మ, అఖిల్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు పరాంకుశం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సుదర్శనహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



కంచికచర్ల : అమెరికాలో ఉంటున్న తన మనవడు తారుస్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ కంచికచర్ల సభ్యుడు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు శనివారం స్థానిక అమ్మానాన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో 35మంది వృద్ధులు ఉన్నారని, వారికి ప్రతిఒక్కరూ సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నంబూరు నరసింహారావు, టి.వెంకటప్పయ్య, దేవిరెడ్డి చంద్రశేఖర్, సూదుల సోమశేఖరరావు, ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

నరసింహారావుపాలెం(వీరులపాడు): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి సూచించారు. మండలంలోని నరసింహారావుపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బ్యాగు, పాఠ్య, నోట్ పుస్తకాలతో కూడిన స్టూడెంట్ కిట్లను ఆమె పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ కోటా కల్యాణ్ చక్రవర్తి అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగంతో కలిసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో బాగంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఉత్తేజాన్ని కలిగించిందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ టి.నాగరాణి పాల్గొన్నారు.

ఆస్పత్రులు కిటకిట

- ఆస్పత్రుల్లో చేరిన 50మందికి పైగా డయేరియా బాధితులు
- ఆరుగురు మృతి
- 30మంది డిశ్చార్జి
- పేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న 19మంది పేషంట్లు
- నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు



జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న డయేరియా బాధితులు



డయేరియా పేషంట్లకు వైద్యసేవలందిస్తున్న వైద్యులు



డయేరియా పేషంట్లతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి



డయేరియా బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్, ఆర్డీవో

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో విజృంభించిన డయేరియా కారణంగా ఆరుగురు వ్యక్తులు మృతిచెందారు. సుమారు 20మందికిపైగా డయేరియా బాధితులు పేట ప్రభుత్వాసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఎస్.శివన్నారాయణ(39) మూడురోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుండటంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాసుపత్రికి పంపించగా, వైద్యులు పరీక్షించి శివన్నారాయణ మృతి చెందినట్లు చెప్పారని కుటుంబసభ్యులు తెలిపారు. మండలంలోని చిల్లకల్లుకు చెందిన తోటపల్లి వెంకటేశ్వర్లు(75) వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడుతుండంతో ఆయనను పేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు మృతుడి కుటుంబసభ్యులు వివరించారు. డయేరియా కారణంగా మరో నలుగురు వ్యక్తులు రంగయ్య(60),మంగతాయారు(55), జమ్మా(55), సత్యవతి(75) శనివారం మృతిచెందారు.

ఆస్పత్రిలో 19డయేరియా కేసులు..

రెండురోజులుగా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి వార్డులన్నీ డయేరియా పేషంట్లతో నిండిపోయాయి. సుమారు 50మంది వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురై ప్రభుత్వాస్పత్రితోపాటు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్సపొందగా, వారిలో 30మంది వరకు డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో 19మంది పేషంట్లు చికిత్స పొందుతున్నారు. వీరిలో జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి, బూదవాడ, గండ్రాయి, జయంతిపురం, వత్సవాయి మండలంలోని మక్కపేట, మంగొల్లు, దేచుపాలెం గ్రామాలకు చెందినవారు ఉన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్ సందర్శన..

జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా వ్యాపించడంతో జిల్లా అధికారులతోపాటు రాష్ట్ర అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేటపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వివిధ గ్రామాలకు చెందిన డయేరియా పేషంట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్నారు. సీజనల్ కారణంగా నమోదవుతున్న ఈ డయేరియా లక్షణాలపై ప్రత్యేక పరిశీలన చేస్తున్నామన్నారు. డయేరియా ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

జాయింట్ కలెక్టర్, ఆర్డీవో పరామర్శ...

జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు రవీంద్రరావు, మాధవి, డీసీహెచ్‌వో వీసీఎస్ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ వెంకటసాయి తదితర అధికారులు సందర్శించారు. డయేరియాతో బాధపడుతూ చికిత్సపొందుతున్న వారిని పరామర్శించారు. డీఎంహెచ్‌వో సుహాసిని శుక్రవారం నుంచి జగ్గయ్యపేటలోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పేట తహసీల్దార్ శేషగిరి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.హరీష్ ఎప్పటికప్పుడు వైద్యసేవలతోపాటు డయేరియా నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

షేర్‌మహ్మద్‌పేటలో వైద్యశిబిరం ఏర్పాటు



షేర్‌మహ్మద్‌పేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్, పక్కన ఆర్డీవో రవీంద్ర



షేర్‌మహ్మద్‌పేటలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



డ్రెయిన్లలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో డయేరియా విజృంభించిన నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు శనివారం గ్రామంలోని మండలపరిషత్ పాఠశాలలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి అనూష ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. డయేరియా లక్షణాలున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేసి ముగ్గురు వ్యక్తులు డయేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

ఐదు డయేరియా కేసులు గుర్తింపు..

మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి గ్రామాల్లో ఐదు డయేరియా కేసులు గుర్తించామని బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎస్.అనిల్ కుమార్ తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన యర్రదేశి పిచ్చమ్మ, గుగ్గిళ్ళ చంద్రశేఖర్, మల్లాల విజయలక్ష్మి, గండ్రాయికి చెందిన కొరివి రవి, రమాలను గుర్తించి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం..

అధికారులు గ్రామంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులతో డ్రైన్‌లలో పూడికతీయడంతోపాటు మురుగు నీటి నిల్వ ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించారు. మంచినీటి ట్యాంకుల వద్ద అధ్వాన్నంగా ఉన్న పరిస్థితులను శుభ్రం చేశారు. చెరువు వద్దనున్న మంచినీటి బావి చుట్టూతా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పైప్‌లైన్ లీకులను పునరుద్ధరించి పైపులను ఏర్పాటు చేశారు. ఆయా పారిశుద్ధ్య పనులను గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

గ్రామాన్ని సందర్శించిన జేసీ..

షేర్‌మహ్మద్‌పేట గ్రామాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ శనివారం సదర్శించారు. చెరువు వద్దనున్న మంచి నీటి బావిని పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వాంతులు, విరేచనాలు ఉంటే ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. డయేరియాతో ఇప్పటివరకు ఎవరూ మృతి చెందలేదని, ఆయా కారణాలతో మృతి చెంది ఉంటారని వైద్యారోగ్య శాఖాధికారులు చెబుతున్నారన్నారు. గ్రామంలో డయేరియా తీవ్రత తగ్గే వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. జేసీ వెంట నందిగామ, తిరువూరు ఆర్డీవోలు ఎ.రవీంద్ర, మాధవి, డీపీవో శివప్రసాద్ యాదవ్, తహసీల్దార్ శేషగిరి, ఎంపీడీవో రమేష్, ఈవోపీఆర్డీ సాంబశివరావు, అన్ని శాఖల అధికారులు ఉన్నారు. చిల్లకల్లులో కూడా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి అనిల్ తెలిపారు.



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది



గ్రామంలోని మంచినీటి బావి వద్ద పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఎమ్మెల్యే తాతయ్య



ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో డయేరియా విజృంభించిన నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం కలిశారు. ఈ సందర్భంగా వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విస్తరిస్తున్న డయేరియా వ్యాధి నివారణకు చేపట్టిన చర్యలను ఆయనకు వివరించినట్లు ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు. నియోజకవర్గంలో ఆరోగ్య సంబంధమైన సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ వారికి తగు ఆదేశాలు జారీ చేయాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. ఈ ఈ మేరకు తగిన ఆదేశాలు జారీచేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మాంసం దుకాణాలు తాత్కాలికంగా బంద్



పేటలో చేపల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు పట్టణంలోని చేపలు, మాంసం, చికెన్ షాపులను తాత్కాలికంగా మూసివేసేలా ఆదేశాలు జారీచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో తోపుడు బండ్లను కూడా పెట్టవద్దని ఆదేశించారు. డయేరియా కేసులు ప్రభలుతున్న నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్.రమేష్‌బాబు జగ్గయ్యపేటలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారన్నారు. తనిఖీల్లో భాగంగా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు జగ్గయ్యపేట పట్టణంలోని రోడ్డు మార్జిన్లలో తోపుడు బండ్లపై, మార్కెట్లలో ఉండే హోటళ్లు, జ్యూస్ పాయింట్లు, పానీపూరి, చికెన్, మటన్, చేపల మార్కెట్లలో అమ్మకాలను నిలిపివేయాలని కమిషనర్ ఆదేశించారు. డ్రైనేజీలకు సమీపంలో ఆర్‌వో ప్లాంట్లను నిర్వహించేవారు వాటర్ క్యాన్‌లను బ్లీచింగ్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరచిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ నిబంధనలు అమలుచేయనిచో వాటర్ ప్లాంట్లను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్‌లను పబ్లిక్ హెల్త్ విభాగం అధికారి ఎన్.శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ డి.భూషణం తనిఖీ చేశారన్నారు. మురుగు కాల్వలకు దగ్గరగా ఉన్న వాటర్‌ట్యాంక్‌ల నుంచి నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు కమిషనర్‌వివరించారు.

మక్కపేటలో పెరుగుతున్న బాధితుల సంఖ్య



మక్కపేట శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మక్కపేట(వత్సవాయి): వత్సవాయి మండలంలోనూ డయేరియా ప్రబలుతోంది. గడిచిన కొన్నిరోజులుగా డయేరియా బాధితుల సంఖ్య పెరుగుతోంది. మక్కపేటలో ఐదుగురు, దేచుపాలెంలో ఒకరు. దబ్బాకుపల్లిలో ముగ్గురు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నట్లు వైద్యసిబ్బంది గుర్తించారు. దీంతో మక్కపేట పాత పంచాయతీ కార్యాలయ భవనంలో వైద్యాధికారి హర్షితాబేగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ గ్రామస్తులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇంటింటి సర్వే కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. మక్కపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆర్డీఓ రవీంద్రబాబు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉషారాణి, తహసీల్దార్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ భరద్వాజ్ సందర్శించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మండలంలో పెనుగంచిప్రోలు తూర్పు బజారు ఒకరు, అనిగండ్లపాడు, సుబ్బాయిగూడెంలో ఒక్కొక్కరు ఆసుపత్రికి వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు తగు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సూచించినట్లు వివరించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలు తినాలని వైద్యసిబ్బంది సూచించారు.

ప్రత్యేక బృందాల నియామకం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో డయేరియా వ్యాధి వ్యాపిస్తున్న నేపథ్యంలో వార్డుల్లో డయేరియా లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు పురపాలక సంఘ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు శనివారం తెలిపారు. డయేరియా కేసుల నమోదు, డోర్‌టూడోర్ సర్వే, ప్రత్యేక శానిటేషన్ నిర్వహణ కోసం ఈ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిధిలోని సచివాలయాలకు సూపర్‌వైజింగ్ అధికారులుగా నియమిస్తూ ఆయా బృందాలచేత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలసి ప్రత్యేక శానిటేషన్, మురుగు కాలువల్లో కలిసిన పైపులైన్లను తొలగించడం, పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులకు చేపడుతున్నట్లు వివరించారు. హెల్త్ కార్యదర్శులతో డోర్‌టు డోర్ సర్వే నిర్వహించి రిపోర్టు అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సచివాలయ నోడల్ అధికారులు, ఉమెన్ ప్రొటెక్షన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో అవగాహన కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. ఆయా అంశాలపై రోజూ సాయంత్రం ఐదుగంటలకు నివేదికను అందజేసేలా ప్రత్యేక టీమ్‌లను ఆదేశించినట్లు కమిషనర్ వివరించారు.

నందిగామలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హేమమాలిని

నందిగామ: వర్షాకాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హేమమాలిని తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య పనులలో భాగంగా పట్టణ పరిధిలోని రెండోవార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను ప్రీస్కూల్‌లో చేర్పించాలి



పెండ్యాలలో గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, అంగన్‌వాడీలు

పెండ్యాల(కంచికచర్ల): మూడేళ్లు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు వెంటనే ప్రీస్కూల్‌లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ కోరారు. మండలంలోని పెండ్యాలకాలనీ ప్రీస్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా కరీమాబీ మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులందరినీ ఒకటో తరగతిలో చేర్పిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నందున చిన్నారులను ప్రీస్కూల్‌కు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగనవాడీ కార్యకర్తలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగనవాడీ కేంద్రాలలో చేర్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎంఈవో పాల్ కెనడీ సూచించారు. వీరులపాడు గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఆయన సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): కలియుగ దైవం శ్రీనివాసుడిని భక్తిప్రపత్తులతో పూజిస్తే, కష్టాలన్నీ తొలగిపోయి సకల శుభాలు కలుగుతాయని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాంబేకాలనీలోని హెచ్‌బ్లాక్-3లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సంతాన వెంకటేశ్వర స్వామివారి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అశేష భక్తజన సందోహం సమక్షంలో వేద మంత్రోచ్చరనల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ వేడుకల్లో మల్లాది విష్ణు పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో ప్రజల్లో ఆధ్యాత్మికత వెల్లివిరియడంతో పాటు, ఐక్యత పెరుగుతుందని అన్నారు. దేవాలయాల్లో నిర్మలమైన వాతావరణం, భగవద్ధ్యానం వంటివి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని పేర్కొన్నారు. దేవస్థాన అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వెల్లడించారు. వెంకటేశుని దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా మల్లాది విష్ణు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, మేడా రమేష్, నాలం బాబు, హనుమకొండ చలమేశ్వరరావు, అవుటుపల్లి నాగరాజు, పెన్నేరు మూర్తి కిరణ్, దానిపర్తి రాంబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పండూరుకు చెందిన నృత్యాంజలి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై హరిలోకేష్ శర్మ శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఎంతో ఆసక్తితో నృత్య ప్రదర్శనను వీక్షించారు. అనంతరం నృత్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.